




## 'గంగన్న పాలెం'లో గంగమ్మ మాయం

ఇది నల్లగొండకు సమీపంలోని తిప్పర్తి మండలం గంగన్న పాలెం చెరువు. చుట్టూ పది ఊర్ల చెరువులకు ఆదెరువు. ఉదయ సముద్రం సరప్లస్, మిషన్ భగీరథ వృథా నీటితో నిత్యం జలకళ తో నిండు కుండలా ఉండే ఈ చెరువు ఇప్పుడు నెర్రెలు బారి ఎండిపోతున్నది. ఈ చెరువు కింద ఉన్న పొలాలు కూడా ఎండి పోయాయి. - స్టాఫ్ ఫొటోగ్రాఫర్, నల్లగొండ

# 3 నెలల్లోనే మునుపటి కష్టాలు

## కాంగ్రెస్ పాలనలో గాడితప్పిన ఎవుసం

- సాగునీళ్లు కరువై రైతన్నకు కష్టకాలం
- 3ఎకరాలు దాటని పెట్టుబడి సాయం
- నీళ్ల కోసం రోడ్డెక్కుతున్న రైతులు
- పొట్టకొచ్చిన పంట చేతికందడం గగనమే
- కమ్ముకుంటున్న కరువుఛాయలు

హైదరాబాద్, మార్చి 10 (నమస్తే తెలంగాణ) : మొన్నటి వానకాలం సీజన్ వరకు పచ్చని పంటలతో కళకళలాడిన రాష్ట్రంలో ప్రస్తుతం ఎండిన పంటలు ఎక్కిరిస్తున్నాయి. ఎంత పంట వేసినా నీళ్లు పారుతాయనే ధీమా నుంచి... వేసిన పంటైనా పారుతుందో లేదో అనే దుర్భర పరిస్థితి వచ్చింది. బీఆర్ఎస్ పాలనలో గాడిన పడ్డ ఎవుసం.. కాంగ్రెస్ మూడు నెలల పాలనలోనే గాడి తప్పుతున్నది. మొత్తంగా రైతులకు మళ్లీ కష్టకాలం మొదలైంది. మునపటి రోజులు కండ్ల ముందు కదులుతున్నాయి. ఎండిన పంటలు, అడుగంటిన బోర్లు, బావులు, కరెంట్ కష్టాలు, పంటలకు మద్దతు ధర ఇక్కట్లు ఇలా కొన్నేండ్లుగా రైతులకు దూరంగా ఉన్న సమస్యలన్నీ మళ్లీ ఒక్కసారే ముప్పేట దాడి చేస్తున్నాయి. పంటలు చేతికొచ్చే పరిస్థితి లేక పెట్టుబడి భారమై రైతులు అప్పులపాలవుతూ ఆత్మహత్యలు చేసుకుంటున్నారు.

### నీళ్లు లేక ఎండుతున్న పంటలు...

మొన్నటి వరకు పుట్ల కొద్ది వడ్లు పండిన రాష్ట్రంలో ఇప్పుడు పంట చేతికి రావడమే గగనంగా మారింది. ఇప్పటి వరకు సుమారు 51 లక్షల ఎకరాల్లో వరి పంట సాగైంది. ఇందులో అత్యధికంగా ఉమ్మడి నల్గొండలో సుమారు 11 లక్షల ఎకరాల్లో సాగైంది. ఆ తర్వాత ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో 10 లక్షల ఎకరాల్లో, నిజామాబాద్‌లో 8 లక్షల ఎకరాల్లో సాగైంది. కాళేశ్వరంపై కాంగ్రెస్ పార్టీ పగ, సాగు నీళ్ల నిర్వహణలో అలసత్వం వ్యవసాయరంగాన్ని ఒక్కసారిగా అతలాకుతలం చేస్తున్నది. సాగునీళ్లు లేకపోవడంతో రాష్ట్ర వ్యాప్తంగా వరి పంటకు తీవ్ర నష్టం వాటిల్లుతున్నది. 51 లక్షల ఎకరాల్లో వరి సాగైతే సగం పంట సాగునీళ్లు లేక ఎండిపోవడం ఖాయమనే అంచనాలున్నాయి. గతేడాది ఈ సమయానికి సుమారు 74 లక్షల ఎకరాల్లో వివిధ పంటలు సాగు కాగా ప్రస్తుతం ఇది 66 లక్షల ఎకరాలకే పరిమితమైంది. అంటే గత యాసంగితో పోల్చితే 8 లక్షల ఎకరాల్లో పంటల సాగు తగ్గడం గమనార్హం. ఇందులో వరి సాగే ఏకంగా 6.25 లక్షల ఎకరాల్లో తగ్గడం గమనార్హం. ఇప్పటికే ఉమ్మడి నల్గొండ, కరీంనగర్, నిజామాబాద్, మహబూబ్‌నగర్, మెదక్ జిల్లాల్లో కాంగ్రెస్ తెచ్చిన కరువుఛాయలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. పంట చేతికొచ్చే పరిస్థితి లేకపోవడంతో కొందరు రైతులు పశువులను వదిలేస్తే.. మరికొన్ని చోట్ల ఎండిన వరి పైరుకు నిప్పు పెడుతున్నారు. కొన్ని చోట్ల పొట్టకు వచ్చిన వరి పైరుకు ట్యాంకర్లతో నీళ్లు అందిస్తున్నారు.


వరంగల్ జిల్లా నల్లబెల్లి మండలం కన్నారావుపేటలో ఎండిన వరి పంట వద్ద రైతు లక్ష్మయ్య

### రైతుల ధర్నాలు.. మళ్లీ మొదలు

ఉమ్మడి రాష్ట్రంలో సాగునీళ్లు, కరెంట్, ఎరువులు, మద్దతు ధర కోసం రైతులు రోడ్డెక్కడం సర్వసాధారణంగా ఉండేది. కానీ తెలంగాణ ఏర్పాటు తర్వాత ఆ పరిస్థితి పూర్తిగా మారిపోయింది. బీఆర్ఎస్ ప్రభుత్వం వ్యవసాయాన్ని గాడిలో పెట్టి రైతుల కష్టాలు తీర్చింది. కానీ పదేండ్ల తర్వాత మళ్లీ మునపటి రోజులు కండ్ల ముందు కదులుతున్నాయి. సాగు నీళ్ల కోసం, కరెంట్ కోసం, ఎరువుల కోసం, మద్దతు ధర కోసం రైతులు మళ్లీ రోడ్డెక్కుతున్నారు. ఓ వైపు యాసంగి సీజన్ పూర్తవుతున్నా ఇప్పటి వరకు కాంగ్రెస్ ప్రభుత్వం రైతుబంధు పూర్తిగా అందలేదు. డిసెంబర్ 9వ తేదీన ప్రారంభించిన యాసంగి పెట్టుబడి సాయం మూడు నెలలుగా కొనసాగుతూనే ఉంది. ఇప్పటి వరకు మూడెకరాల రైతులకే పెట్టుబడి సాయం జమ చేసినట్లు తెలిసింది. ఇంకా మిగిలిన వారికి ఎప్పుడు జమ చేస్తారో తెలియని పరిస్థితి నెలకొంది.

## పదో తారీఖొచ్చినా పత్తాలేని సాగునీళ్లు

### హామీ ఇచ్చి ముఖం చాటేసిన అధికారులు

పెద్దపల్లి, మార్చి 10(నమస్తే తెలంగాణ): ఎస్సారెస్పీ చివరి ఆయకట్టులోని రైతులు సాగు నీళ్ల కోసం తండ్లాడుతున్నారు. కండ్ల ముందే ఎండుతున్న పంటలను చూడలేక రైతులు ఈ నెల 6న మంథని-పెద్దపల్లి ప్రధాన రహదారిపై ధర్నాకు దిగారు. దీంతో దిగివచ్చిన మంథని ఆర్డీవో హనుమానాయక్ ఆధ్వర్యంలోని అధికారుల బృందం ఈ నెల 9 వరకు అన్ని గ్రామాలకు సాగు నీటిని అందిస్తామని హామీ ఇవ్వడంతో రైతులు ఆందోళన విరమించారు.అయితే పదో తారీఖు వచ్చినా సాగు నీళ్లు పత్తా లేకపోవడంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.



### అన్యాయమై పోయినం..

మాది మంథని మండలం పుట్టపాక గ్రామం. నాకు మూడెకురాల పొలం ఉన్నది. ఎస్సారెస్పీ నీళ్లు రాక ఈసారి చానా అన్యాయమై పోయినం. ఈ పంట పోయినట్టే. అందుకే గొర్ల మేపుతున్నం. మమ్ముల ప్రభుత్వమే ఆదుకోవాలె.

-కొమ్ము సారయ్య, పుట్టపాక, మంథని, పెద్దపల్లి జిల్లా

### పెట్టుబడి కూడా లాసే..



మాది మంథని మండలం సిద్ధపల్లి గ్రామం. నాకు పుట్టపాక గ్రామ శివారుల మూడెకరాలు ఉంది. ఇంకో ఐదెకురాలు బటాయి(కౌలు)కి తీసుకొని దున్నుతున్న. పదేండ్ల నుంచి ఎన్నడూ నా పంట ఎండలేదు. ఈ సారే ఇట్లయ్యింది. ఈ పంటకు గతేడాది వారానికోసారి పుష్కలంగా నీళ్లచ్చేది. ఈ ఏడు ఒకే ఒక్కసారి నీళ్లచ్చినై. ఆ నీళ్లు కూడా పంట తడిసే అన్ని రాలే. దీంతోటి నా పొలం మీద ఆశలన్నీ పోయినై. ఎకరానికి రూ.35 వేల పెట్టుబడి పెట్టా..మొత్తం లాసే.

-సిద్ధ సదయ్య, సిద్ధపల్లి, మంథని

## బోరుపైపులు దించుతుండగా కాటేసిన కరెంట్

- ఒకరు మృతి, మరో ముగ్గురికి తీవ్రగాయాలు
- రాజన్నసిరిసిల్ల జిల్లా బావుసాయి పేటలో విషాదం

కోనరావుపేట, మార్చి 10 : బోరులో నీరు అడుగంటిపోవడంతో మరిన్ని పైపులు దించుతుండగా నలుగురు కూలీలు విద్యుత్ షాక్‌కు గురయ్యారు. అందులో ఒకరు అక్కడికక్కడే మృతి చెందగా మరో ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు. రాజన్నసిరిసిల్ల జిల్లా కోనరావుపేట మండలంలోని బావుసాయిపేట గ్రామానికి చెందిన తిక్కల భూమయ్య తనకున్న ఎకరం పొలంలో వరి సాగు చేశాడు. పంట గొలక దశకు వస్తుండగా బోరులో నీళ్లు అడుగంటిపోయాయి. దీంతో బోరులో మరిన్ని పైపులను దించాలని ఆదివారం గ్రామానికి చెందిన పంబల్ల భూమయ్య(38), పంబల్ల రాజు, కర్నాల శ్రీనివాస్, కర్నాల మహేశ్‌ను కూలీకి పిలిచాడు. పొలం పక్కన ఉన్న మరో రైతు బోనాల రాములు సహకారంతో మోటారు పైపులను దించుతున్నారు. ఈ క్రమంలో బోరు పైపులు హై వోల్టేజీ విద్యుత్ మెయిన్ తీగలకు తగిలి పైపు పట్టుకున్న నలుగురికి విద్యుత్ షాక్ తగిలింది. ఇందులో పంబల్ల భూమయ్య (38) అక్కడికక్కడే మృతి చెందాడు. పంబల్ల రాజుకు కుడిచేయి కాలిపోయింది. మరో ఇద్దరు కర్నాల శ్రీనివాస్, మహేశ్ తీవ్రంగా గాయపడ్డారు. ఇది గమనించిన రైతులు బాధితులను అంబులెన్స్‌లో వేములవాడ ఏరియా దవాఖానకు తరలించారు. వేములవాడ ఏరియా దవాఖానలో బాధితులను కరీంనగర్ మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్‌కుమార్, ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్, జడ్పీ చైర్‌పర్సన్ న్యాలకొండ, పార్టీ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య అరుణ పరామర్శించారు. అనంతరం సిరిసిల్ల ఏరియా దవాఖానలో భూమయ్య మృతదేహాన్ని పరిశీలించి వారి కుటుంబ సభ్యులను మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్‌కుమార్ ఓదార్చారు. మృతుడి కుటుంబానికి తక్షణ సాయం కింద రూ.5లక్షలు ఇవ్వాలని, సెస్ సంస్థ ద్వారా ఆదుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.


సిరిసిల్లలోని ఏరియా దవాఖానలో భూమయ్య కుటుంబ సభ్యులను ఓదార్చుతున్న కరీంనగర్ మాజీ పార్లమెంట్ సభ్యుడు బోయినపల్లి వినోద్‌కుమార్

## రాత్రి కరెంట్‌కు మరో రైతు బలి

- పొలానికి నీరు పెట్టేందుకు వెళ్లి..
- విద్యుత్తు షాక్‌తో రైతు గణేశ్ మృతి

చేగుంట, మార్చి 10 : రాత్రి కరెంట్‌కు మరో రైతు బలయ్యాడు. సిద్దిపేట జిల్లా దౌల్తాబాద్ మండలం గువ్వలేగి గ్రామానికి చెందిన రైతు బోయిని గణేశ్ (42)కు మెదక్ జిల్లా చేగుంట మండలం బీ-కొండాపూర్ పరిధిలో రెండెకరాలు ఉంది. అందులో వరి, మక్క పంట వేశాడు. పంట చేతికొచ్చే సమయంలో నీరందక ఎండిపోతుండడంతో.. ఆదివారం తెల్లవారుజామున పారకం పెట్టేందుకు చేనుకు వెళ్లాడు. బోరు నడవకపోవడంతో ట్రాన్స్‌ఫార్మర్ వద్ద వైరును సరిచేస్తుండగా ప్రమాదవశాత్తు షాక్ తగిలి గణేశ్ అక్కడికక్కడే మృతి చెందాడు. గణేశ్‌కు భార్య కమల, కుమారులు కార్తీక్, అనిల్ ఉన్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు చేగుంట ఎస్ఐ బాల్‌రాజు తెలిపారు.

# రైతు ఉద్యమం తప్పదు

- అన్నదాతను గోసపెడుతున్న సర్కార్
- బీఆర్ఎస్ పెద్దపల్లి ఎంపీ అభ్యర్థి కొప్పుల
- వెల్గటూర్‌లో ఎండిన పొలాల పరిశీలన

జగిత్యాల, మార్చి 10 (నమస్తే తెలంగాణ)/ధర్మారం: కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన మూడు నెలలకే రైతులను అరిగోస పెడుతుందని మాజీ మంత్రి, పెద్దపల్లి బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్ ఆందోళన వ్యక్తం చేశారు. రైతులకు సాగునీటిని అందించాలని, లేదంటే పంట నష్టపరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు.నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే రైతు ఉద్యమం ప్రారంభమవుతుందని హెచ్చరించారు. జగిత్యాల జిల్లా ఎండపెల్లి మండలం మారేడుపల్లి,ముంజంపల్లి, ఉండెడ గ్రామాల్లో 1,800 ఎకరాల్లో దెబ్బతిన్న వరిపొలాలను జగిత్యాల జడ్పీ చైర్‌పర్సన్ దావ వసంతతో కలిసి ఆదివారం ఆయన పరిశీలించారు. అనంతరం పెద్దపల్లి జిల్లా ధర్మారం మండలం బొమ్మారెడ్డిపల్లిలోని మహేశ్వర ఫంక్షన్ హాలులో నిర్వహించిన బీఆర్ఎస్ పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశంలో మాట్లాడారు. ఎస్సారెస్పీ పంప్‌హౌస్ ద్వారా నీళ్లు వస్తాయని గంపెడాశతో దాదాపు 820 మంది రైతులు వరి సాగు చేశారని పేర్కొన్నారు. పొట్ట దశలో సాగు నీరందకపోవడంతో పొలాలన్నీ ఎండిపోయాయని ఆందోళన వ్యక్తం చేశారు.కాలువ ద్వారా నీళ్లు ఇవ్వని పరిస్థితుల్లో మారేడుపల్లి పక్కనే ఉన్న వేంనూర్ పంప్‌హౌస్ నుంచి నంది రిజర్వాయర్‌కు నీటిని తరలించే పైప్‌లైన్ వాల్వ్‌ను విప్పి ఎస్సారెస్పీ 11-ఎల్ కాలువలోకి నీటిని మళ్లించి, వాటి ద్వారా పంటలు కాపాడవచ్చని సూచించారు. మేడిగడ్డ వద్ద కాఫర్ డ్యామ్ నిర్మించి ప్రాజెక్టును వినియోగించవచ్చని సూచించారు. కాళేశ్వరం ప్రాజెక్టు వల్ల ప్రయోజనం లేదని చెప్పడానికే కాంగ్రెస్ సర్కార్ కుట్ర చేస్తున్నదని విమర్శించారు. ఎంపీ ఎన్నికల్లో బీఆర్ఎస్ విజయం సాధించడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు.


జగిత్యాల జిల్లా ఎండపెల్లి మండలం ముంజంపల్లిలో నెర్రెలుబారిన పొలంలోనే మీడియాతో మాట్లాడుతున్న ఈశ్వర్

## ఎప్పుడు పోద్దో గీ పీడ



లోవోల్టేజీతో విద్యుత్ మోటర్లు కాలిపోతున్నై. ఒక్కో మోటర్‌కు అల్లిస్తే రూ. 3 వేల నుంచి రూ. 5 వేలు ఖర్చు అయితాంది. రెండు నెలల నుంచి రాత్రి బగర్ టైమ్‌లో త్రీఫేస్ ఇత్తాండ్లు. పంటలకు నీళ్లు లేక ఎండిపోతున్నై. కేసీఆర్ ఉంటే గీ గోస ఉండేది కాదు. ఆయనే కరెంట్, రైతు బంధు, అదునుకు పిండి బత్తాలు, ఇత్తనాలు ఇస్తుండే. పదేండ్లుగా ఏనాడూ పంటలు ఎండిపోలే. గిప్పుడు మల్లా కాంగ్రెసోళ్లు దాపురించాక గోస పడుతున్నం. ఎప్పుడు పోద్దో గీ పీడ.

- ఎలబోయిన కట్టయ్య,దస్తగిరిపల్లె

## ముళ్లపొదలతో కాల్వలు


రామతీర్థం గ్రామ సమీపంలోని ఎస్సారెస్పీ డీబీఎం 38 ఉపకాల్వ ముళ్లపొదలతో పూర్తిగా కూరుకుపోయింది. ఈ కెనాల్ నీటిపై ఆధారపడి చాలా మంది రైతులు ఆరుతడి పంటలు సాగు చేశారు. సాగు నీరందక పంటలు ఎండిపోతున్నాయని ఆయకట్టు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. -నల్లబెల్లి

## మంచినీళ్ల కోసం మౌన ప్రదర్శన

బండ్లగూడ, మార్చి 10: తమ కాలనీలో తాగునీటి సమస్యలు పరిష్కరించాలని ఆదివారం బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని పద్మశ్రీ కాలనీ వాసులు ప్లకార్డులను పట్టుకొని చేవెళ్ల రోడ్డుపై మౌన ప్రదర్శన చేశారు. కాలనీలో తాగునీటి ఎద్దడి తీవ్రస్థాయిలో ఉందని జలమండలి మేనేజర్ శ్రీనివాస్‌తోపాటు జనరల్ మేనేజర్‌కు అనేక మార్లు ఫిర్యాదులు చేసినా పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి వెంటనే తమకు మంచినీళ్లు అందించాలని వారు విజ్ఞప్తి చేశారు. ఈ విషయంపై కార్పొరేటర్ పద్మావతిపాపయ్యయాదవ్ మాట్లాడుతూ పద్మశ్రీ కాలనీలో 10 లక్షల లీటర్ల సామర్థ్యం గల రిజర్వాయర్‌ను నిర్మించేందుకు ఏర్పాట్లు చేశామని చెప్పారు. అయితే జనరల్ మేనేజర్ రవీందర్‌రెడ్డి బదిలీ కావడంతో రిజర్వాయర్ పనులు ప్రారంభోత్సవానికి నోచుకోలేదని చెప్పారు. జలమండలి అధికారులతో చర్చించి మంచినీళ్లు అందించేందుకు తగిన చర్యలు తీసుకుంటామని తెలిపారు.


చేవెళ్ల ప్రధాన రహదారిపై నిరసన తెలుపుతున్న పద్మశ్రీహిల్స్ కాలనీ ప్రజలు

## తాగునీటి కోసం మహిళల తండ్లాట

### నస్కల్‌లో ఖాళీ బిందెలతో నిరసన

నిజాంపేట, మార్చి 10: మెదక్ జిల్లా నిజాంపేట మండలంలోని నస్కల్ ఎస్సీ కాలనీలో మిషన్ భగీరథ నీరు రాక స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కాలనీవాసులు సమీప వ్యవసాయ పొలం నుంచి బిందెలతో నీళ్లు తెచ్చుకుంటున్నారు. సర్పంచుల పదవీ కాలం ఉన్నంత వరకు ఎలాంటి నీటి సమస్య లేదని, ప్రత్యేకాధికారుల పాలన ప్రారంభమైన కొద్ది రోజుల్లోనే నీటి సమస్య ఏర్పడిందని కాలనీవాసులు ఆరోపిస్తున్నారు. ఈ మేరకు మహిళలు ఆదివారం ఖాళీ బిందెలతో నిరసన తెలిపారు.


మెదక్ జిల్లా నిజాంపేట మండలం నస్కల్‌లో ఖాళీ బిందెలతో నిరసన తెలుపుతున్న మహిళలు

ఊరంతా శ్రమదానం


కుమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లా కెరమెరి మండలం పాటగూడ గ్రామంలో బావి తవ్వేందుకు వెళ్తున్న గిరిజనులు


మూడునెలలుగా నిరుపయోగంగా ఉన్న మిషన్ భగీరథ ట్యాంకు

# 'పాటగూడ' పానీపాట్లు

**కేసీఆర్ సర్కారులో ఇంటింటికీ 'భగీరథ' నీరు • అధికారుల నిర్లక్ష్యంతో మూడు నెలలుగా అందని నీళ్లు**

### వేసవి నేపథ్యంలో ఊరంతా కలిసి కొత్త బావి తవ్వకం

కుమ్రం భీం ఆసిఫాబాద్ (నమస్తే తెలంగాణ)/కెరమెరి, మార్చి 10: కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లా కెరమెరి మండల కేంద్రానికి 20 కిలోమీటర్ల దూరంలో ఉన్న పాటగూడ.. తాగునీటి కోసం పడరాని పాట్లు పడుతున్నది. కేసీఆర్ సర్కారులో మిషన్ భగీరథ ద్వారా ఇంటింటికీ నీరు రాగా.. ప్రస్తుతం గుక్కెడు నీటి కోసం తండ్లాడుతున్నది. చివరకు ఎవరో వస్తారని ఎదురుచూడకుండా కొలాం గిరిజనులంతా ఏకమై బావి తవ్వుకుంటున్నారు. పాటగూడలో 40 ఇండ్లు ఉండగా.. దాదాపు 240 వరకు జనాభా ఉంది. 500 వరకు ఆవులు, మేకలు తదితర జీవాలున్నాయి. కేసీఆర్ సర్కారులో మిషన్ భగీరథ పథకం ద్వారా ఇంటింటికీ నల్లాలు ఏర్పాటు చేసి రోజూ తాగునీరందించారు. ప్రస్తుతం 'మిషన్ భగీరథ' నిర్వహణ సరిగా లేక.. మరమ్మతులు చేపట్టక నీరందడం లేదు. ఇక చేసేదేమీ లేక గిరిజనులు అష్టకష్టాలు పడుతూ గ్రామ పొలిమేరలో ఉన్న బావి వద్దకు వెళ్లి నీరు తెచ్చుకుంటున్నారు. వేసవి రావడంతో ప్రస్తుతం ఆ బావిలో నీళ్లు కూడా అడుగంటి పోతున్నాయి.

### కలిసికట్టుగా బావి తవ్వకం

ప్రస్తుత వేసవిలో తాగునీళ్లకు ఇబ్బందులు తలెత్తకుండా గ్రామానికి కిలోమీటర్ దూరంలో ఉన్న వాగులో గ్రామస్థులంతా కలిసి కొత్తగా బావి తవ్వుకుంటున్నారు. చిన్నా పెద్దా తేడా లేకుండా బావి తవ్వకంలో పాలు పంచుకుంటున్నారు. నిత్యం తెల్లవారు జామున 4 గంటలకు నిద్ర లేవడం.. ఇదివరకు ఉన్న బావి వద్దకు వెళ్లి నీళ్లు తెచ్చుకోవడం.. హడావుడిగా ఇంటి పనులు పూర్తి చేసుకోవడం.. ఆపై వాగులో బావి తవ్వడం తప్ప మరే పనిచేయడం లేదు. అధికారులు ఇప్పటికైనా స్పందించి కేసీఆర్ సర్కారు ఏర్పాటు చేసిన మిషన్ భగీరథ ట్యాంకులకు మరమ్మతులు చేపట్టి తాగునీరు సరఫరా చేయాలని వారు కోరుతున్నారు.

### అందరం కలిసి బావి తవ్వుకుంటున్నం



మా ఊరిలో తాగునీటికి మస్తు తిప్పలైతాంది. మా ఊరి శివారులోనున్న బావి వద్దకు కాలినడకన వెళ్లి నీళ్లు తెచ్చుకుంటున్నం. అందులో నీళ్లు కూడా అడుగంటిపోతున్నయి. మరో పదిహేను రోజులు పోతే బావి ఎండిపోతుంది. అందుకే ఊరంతా కలిసి వాగులో కొత్త బావి తవ్వుకుంటున్నం. కేసీఆర్ సర్కారులో మిషన్ భగీరథ ట్యాంకు ద్వారా నీళ్లిచ్చిన్రు. మూడు నెలల సంది తాగునీరు రావట్లేదు.

-ఆత్రం సీతాబాయి, పాటగూడ

### సార్లు స్పందిస్తే ఈ బాధుండదు



కేసీఆర్ సర్కారులో ఇంటింటికీ మిషన్ భగీరథ నీళ్లచ్చినయి. తాగునీటికి బాధే లేకుండే. ఖరాబైందని ఏడాది సంది నీళ్లిత్తలేరు. అధికారులేమో పట్టించుకుంటలేరు. తెల్లవారు జామున 4 గంటల నుంచే నీళ్ల కోసం తిప్పలైతాంది. ఇప్పుడున్న బావి ఎండిపోతాంది. రాబోయే రోజుల్లో ఇబ్బందైతదని అందరం కలిసి కొత్త బావి తవ్వుకుంటున్నం. సార్లు స్పందించి మిషన్ భగీరథ నీళ్లిస్తే మాకీబాధుండదు.

-సిడాం మీరాబాయి, పాటగూడ